మూసీ.. ముంచేసి..




వాహెద్‌నగర్ బ్రిడ్జిపై ట్రాఫిక్‌జాం

● నీట మునిగిన రహదారులు ● నిలిచిపోయిన రాకపోకలు ● ఇళ్లలో చిక్కుకున్న స్థానికులు ● సహాయక చర్యల్లో అధికారులు, పోలీసులు

దిల్‌సుఖ్‌నగర్/చాదర్‌ఘాట్/మలక్‌పేట: భారీ వర్షాలకు మూసీ ఉగ్రరూపం దాల్చింది. శుక్రవారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి ఎల్‌బీనగర్, మలక్‌పేటలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాల్లోని పలు ఇళ్లల్లో వరదచేరడంతో నానా ఇబ్బందులకు గురయ్యారు. రహదారులు సైతం చెరువులను తలపించాయి. బ్రిడ్జిలపై నుంచి భారీగా వరద పారడంతో పోలీసులు, హైడ్రా సిబ్బంది రాకపోకలను నిలిపివేశారు. ఆయా ప్రాంతాలను హైడ్రా కమిషనర్ రంగనాథ్, మలక్‌పేట ఎమ్మెల్యే బలాలా, జీహెచ్ఎంసీ అధికారులు పర్యటిస్తూ బాధితులను మాట్లాడి ధైర్యం కల్పించారు.


బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న వరద


చాదర్‌ఘాట్ లెవల్ బ్రిడ్జి వద్ద మూసీ ఉధృతి


మూసారాంబాగ్‌లో నీట మునిగిన వాహనాలు


శాలివాహననగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న బలాల


ముంపు ప్రాంతాల్లో పర్యటించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్


మూసారాంబాగ్ బ్రిడ్జివద్ద ఉన్న పెట్రోల్ బంక్‌ను చుట్టుముట్టిన నీరు

సైడ్‌లైట్స్..

- మూసారాంబాగ్ బ్రిడ్జి , చాదర్‌ఘాట్ చిన్న బ్రిడ్జిపై నుంచి భారీగా వరద పారడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.
- మూసారాంబాగ్ మూసీ సమీపంలో ఉండే ఇండియన్ అయిల్ పెట్రోల్ బంక్‌లోకి వరద చేరింది.మలక్‌పేట్ వాహేద్‌నగర్ బ్రిడ్జిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. చాదర్‌ఘాట్ బ్రిడ్జి వద్ద సైతం వరద ఉధృతి తీవ్రంగా ఉంది.
- మలక్‌పేట్ నియోజకవర్గం ఓల్డ్‌మలక్‌పేట్ శంకర్‌నగర్ తదితర కాలనీలలోని మూసీ వరదనీరు రావడంతో బస్తీ వాసులు సురక్ష ప్రాంతానికి తరలివెళ్లారు.
- ముంపు ప్రాంతాలలో హైడ్రా కమిషనర్ రంగనాథ్,జిహెచ్‌ఎంసీ అధికారులు పర్యటించారు. నిరాశ్రయులను స్థానికంగా ఉన్న మసీదుల్లోకి తరలించి వారికి భోజనం ఏర్పాటు చేశారు.
- మూసీ రివర్ బెడ్‌లో ఏర్పాటు చేసుకున్న నిర్మాణాలను వరద ముంచేసింది. చాదర్‌ఘాట్, మూసానగర్, శంకర్‌నగర్ బస్తీలలో హైడ్రా కమిషనర్ పర్యటించి స్థానికులతో మాట్లాడుతూ భరోస్తా కల్పించారు.
- కొన్ని ప్రాంతాల్లో రహదారులపై భారీగా నీరు ఉండటంతో ఇళ్లలోనే చిక్కుకున్నారు. వారికి అధికారులు డ్రోన్స్ ద్వారా ఆహారం, తాగు నీరు అందించారు.
- మూసారంబాగ్ బ్రిడ్జిపై అంబర్‌పేట నుంచి మూసారంబాగ్ వైపు బ్రిడ్జి నిర్మాణ పనులు నడుస్తున్నాయి.
- బ్రిడ్జి నిర్మాణం కోసం వేసిన సెంట్రింగ్, నిర్మాణాలకు అడ్డంగా పెట్టిన ఐరన్ షీట్స్ వరదలో కొట్టుకుపోయాయి.
- పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి వరద బాధితులను తరలిస్తున్నామన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

చైతన్యపురి: మూసీ పరీవాహక ప్రాంతంలో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చైతన్యపురి కార్పొరేటర్ రంగానర్సింహగుప్తా, సరూర్‌నగర్ డీసీ శ్రీనివాస్ సూచించారు. డివిజన్‌లోని భవానినగర్, మున్సిపల్ కాలనీ, ఇందిరానగర్, ఫణిగిరి కాలనీ, మారుతీనగర్, వినాయక్‌నగర్ ప్రాంతాల్లో శనివారం వారు పర్యటించి మాట్లాడారు. తరచూ కురుస్తున్న వర్షాలతో మూసీ పొంగి పొర్లుతుందని నాలాలో బ్యాక్ వాటర్ వస్తున్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అవసరమైతే పునరావాస కేంద్రాలు సిద్ధం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ నవీన్, ఏఈ పార్వతి, ఎంఆర్‌ఓ అశ్విని, శానిటేషన్ సూపర్‌వైజర్ బుచ్చయ్య, హైడ్రా ఇన్‌చార్జి మల్లేష్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

నాగోలు: వర్షాకాలంలో ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ పార్టీ రాష్ట్ర సమితి సభ్యురాలు ఎండీ ఫైమీదా అన్నారు. శనివారం నాగోలు డివిజన్ సాయినగర్ హట్స్‌లోని పార్టీ కార్యాలయంలో చిల్డ్రన్ హట్స్ ఫౌండేషన్ సాయినగర్ కమిటీ ఆధ్వర్యంలో చిన్నపిల్లలకు వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో షాహిదాబేగం, వెంకటేష్, రాజుగౌడ్, కృపావరం, పాస్టర్ విజయ్, అనిత, వెంకన్న, మహాలక్ష్మి పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి

దిల్‌సుఖ్‌నగర్: మంత్రి పదవిని సైతం వదులుకుని స్వరాష్ట్రం కోసం పరితపించిన తొలితరం ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కాంగ్రెస్ పార్టీ ఆర్‌కేపురం డివిజ్ అధ్యక్షులు పున్న గణేష్‌నేత కొనియాడారు. మహేశ్వరం నియోజకవర్గం శ్రీ రామకృష్ణాపురం డివిజన్ టెలిఫోన్ కాలనీ చౌరస్తాలో సీనియర్ నాయకులు జెల్ల జగన్నాథం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చిలుక ఉపేందర్ రెడ్డి, బండి మధుసూదన్ రావ్, తల్లాటి రమేష్ నేత, బొడ్డుపల్లి మహేందర్, దుర్గాప్రసాద్, సాయి కుమార్, పెద్దవుర సైదులు, లింగస్వామి గౌడ్, పగడాల ఎల్లయ్య, పొట్టబతిని నగేశ్, ఇడం భాస్కర్, పున్న కృష్ణయ్య, దోర్నాల చంద్రమౌళి, శశి యాదవ్ పాల్గొన్నారు.

రేపు మలక్‌పేట 'కేర్'లో ఉచిత గుండె పరీక్షలు


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు

చాదర్‌ఘాట్: గుండె సమస్యల సంకేతాలు ఉన్నవారు మలక్‌పేట కేర్ హాస్పిటల్‌లో నిర్వహించనున్న ఉచిత గుండె ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్డియాలజీ హెడ్ డాక్టర్ నవీన్‌కుమార్ తెలిపారు. శనివారం హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ ఎడ్లతో కలిసి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ప్రపంచ హృదయ దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 29న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు ఉచిత గుండె ఆరోగ్య పరీక్షల శిబిరం ఉంటుందన్నారు. ఈసీజీ, 2డీ ఎకో, టీఎంటీ పరీక్షలతో పాటు కార్డియాలజీ కన్సల్టేషన్ ఉచితంగా లభిస్తుందని తెలిపారు. యాంజియోగ్రామ్ అవరమని గుర్తించిన వారికి తగ్గింపు ధరలో అందుబాటులో ఉంటుందన్నారు.

వెంకటరాజుకు గౌరవ డాక్టరేట్



నాగోలు: ప్రముఖ పద్యనాటక రంగ స్థల నటుడు చల్లగాలి వెంకటరాజుకు గౌరవ డాక్టరేట్ వరించింది. అమెరికాలోని ఫ్లోరిడా వారు వివిధ రంగాలల్లో నిష్ణాతులలైన కళాకారులను గుర్తించి డాక్టరేట్ ప్రదానం చేస్తున్నారు.ఈ క్రమంలో నాగోలు నివాసి ప్రముఖ రంగస్థల నటుడు చల్లగాలి వెంకటరాజుకు కళారంగంలో చేసిన సేవలకు గుర్తించి అమెరికాలోని రీసెర్చ్ యూనివర్సిటీ ఫర్ సోసియో-ఎకనామిక్ డెవలప్‌మెంట్ ఇంక్ గౌవర డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వెంకటరాజు మాటాడుతూ.. సత్యహరిస్చంద్రుడు, శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, అర్జునుడు, దుర్యోధనుడు, కర్ణుడు, బిల్వమగళుడు, భవానీ శంకరుడు లాంటి అనేక పాత్రలను నాటకరంగంలో పోషించి మెప్పించటమే గాక, శ్రీ వాణి గిరిజ సంగీత నాటక కళాసమితిని స్థాపించి వివిధ రంగాలలో ప్రముఖులైన ఎందరో మహానుభావులను సత్కరించి, ఎంతో మంది యువతీ యువకులను రంగస్థల నటులుగా తీర్చి దిద్దానన్నారు.

మైసయ్యగౌడ్ సేవలు మరువలేనివి

నాగోలు: గీతా పనివారల సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన నాయకుడు కొత్త మైసయ్యగౌడ్ అని రాష్ట గీతా పని వారల సంఘం వర్కింగ్ సెక్రటరీ బొమ్మగాని నాగభూషణం అన్నారు. శనివారం న్యూనాగోలు కాలనీలో సీపీ అనుబంధ ప్రజా సంఘాల కార్యాలయం ఎస్‌కే డాంగే భవన్‌లో నిర్వహించిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా గీతా పనివారల సంఘం మాజీ అధ్యక్షులు దివంగత కొత్త మైసయ్య గౌడ్ వర్ధంతిలో నాగభూషణం పాల్గొని మాట్లాడారు. రంగారెడ్డి జిల్లాల్లో గీతా పని వారల సంఘం అభివృద్ధి ఎంతో కృషి చేశారని తెలిపారు. గీత కార్మికుల హక్కుల కోసం తన జీవితకాలం పోరాడిన నాయకుడు మైసయ్య అన్నారు.

ఖనిజాన్వేషణలో జీఎస్‌ఐ పాత్ర కీలకం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


పారిశుద్ధ్య కార్మికులతో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

మన్సూరాబాద్: ఖనిజాల అన్వేషణలో జీఎస్‌ఐ పాత్ర కీలకమని, జీఎస్‌ఐ శాస్త్రవేత్తల నిరంతర కృషితో అనేక ఖనిజాలను జీఎస్‌ఐ వెలుగులోని తీసుకొచ్చిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. జీఎస్‌ఐ కార్యాలయంలో శనివారం స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా బండ్లగూడ ఆనంద్‌నగర్ చౌరస్తా నుంచి జీఎస్‌ఐ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థ జీఎస్‌ఐ అని ప్రధానీ మోడీ టెర్రరిజాన్ని అణిచివేసి, దేశప్రజలకు నీతివంతమైన పాలన అందిస్తున్నారన్నారు. భారత్ 4వ ఆర్థిక దేశంగా ఎదుగుదలో ప్రధాని మోదీ పాత్ర కీలకమన్నారు. అనంతరం జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌ఐ ఎడీజీ బసాబ్ ముఖోపాధ్యాయ, డీడీజీలు రవి, ఎల్‌పీసింగ్, కార్పొరేటర్లు చింతల అరుణసురేందర్‌యాదవ్, కొప్పుల నర్సింహారెడ్డి, పవన్‌కుమార్, కళ్లెం నవజీవన్‌రెడ్డి, సామ రంగారెడ్డి పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.15, వంకాయ రూ.28, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.23, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.18, క్యారెట్ రూ.40, దొండ రూ.40, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.16, గోకరకాయ రూ.55, దోసకాయ రూ.18, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.18, మునగ రూ.105, కందగడ్డ రూ.28, బీట్‌రూట్ రూ.28, కీర రూ.23, బీన్స్ రూ.65.

మౌలిక వసతుల కల్పనకు కృషి


పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం:రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధి ఖాద్రికాలనీలో శనివారం ఆయన మాజీ కార్పొరేటర్ పద్మానాయక్‌తో కలిసి పర్యటించగా వివిధ సమస్యలు స్థానికులు వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో మంజూరైన మంచినీటి సదుపాయాలు, వీధిదీపాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు. కాలనీలో కొన్ని చోట్ల మాత్రమే డ్రైనేజీ సౌకర్యం ఉందని, మిగతా ప్రాంతాల్లోనూ ఏర్పాటు చేస్తామని, డ్రైనేజీ పూర్తయిన ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణాకు చొరవ చూపుతానన్నారు. సత్యంచారి, రమావత్ శ్రీనివాస్‌నాయక్, నల్ల నాగిరెడ్డి, భిక్షపతి చారి పాల్గొన్నారు.

మహిళల హక్కుల పరిరక్షణే లక్ష్యం


కార్యక్రమానికి హాజరైన పద్మజరమణ

మలక్‌పేట: ప్రభుత్వం వివిధ శాఖల ద్వారా కల్పిస్తున్న సేవలు, చట్టాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సెక్రటరీ పద్మజ రమణ అన్నారు. దేవీనవరాత్రి, బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ఆదేశాల మేరకు దిల్‌సుఖ్‌నగర్ అనిబీసెంట్ ఉమెన్స్ కాలేజీలో సైబర్ భద్రత, సామాజిక మాధ్యామాల వినియోగం, శారీరక, మానసిక ఆరోగ్యం, స్వయం రక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల స్థితిగతులు మెరుగుపరచడానికి, బాధిత మహిళలకు తోడ్పాటు అందించడానికి కమిషన్ కృషి చేస్తుందన్నారు. మహిళల హక్కులను పరిరక్షించడం , వివక్షత తొలగించమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజవల్లి, కాలేజీ సెక్రటరీ డాక్టర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుండె స్పందన ఆపి.. అరుదైన శస్త్రచికిత్స చేసి

యువకుడి ప్రాణాలు కాపాడిన కామినేని వైద్యులు


గుండె శస్త్రచికిత్సను నిర్వహించిన యువకుడితో వైద్యులు

మన్సూరాబాద్: గంటన్నర పాటు గుండెను ఆపి అత్యంత అరుదైన గుండె శస్త్రచికిత్సను చేసి ఓ యువకుడికి ప్రాణదానం చేశారు కామినేని వైద్యులు. శనివారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ రిషిత్ బత్తిని వివరాలు వెల్లడించారు. తీవ్రమైన గుండె సమస్యలతో ఓ వ్యక్తి కామినేని హాస్పిటల్‌కు వచ్చాడు. అన్ని రకాల పరీక్షలు నిర్వహించగా గుండె కవాటంలో లీకేజీలతో పాటు బృహద్ధమని విపరీతంగా సాగిపోయి ఉండటమే కాకుండ లీకేజీ కారణంగా రక్తం శరీరంలోని ఇతర భాగాలకు వెళ్లకుండ తిరిగి గుండెలోకి వచ్చేస్తుంది. దీంతో రోగికి కాళ్ల వాపులు, ఊపిరి అందకపోవడం లాంటి సమస్యలతో ఇబ్బంది పడతూ రోజువారీ పనులు కూడా చేసుకోలేని పరిస్థితికి వచ్చాడు. వీటన్నింటికి తోడు పుట్టుకతోనే గుండెలో రంధ్రం ఏర్పడి వీఎస్డీ అనే సమస్య కూడా ఉంది. వీటంనింటికీ ఒకే శస్త్రచికిత్స అని నిర్ధారించి గుండె స్పందనను గంటన్నర ఆపి అరుదైన శస్త్రచికిత్స చేసి యువకుడి ప్రాణాలు కపాడామన్నారు.

కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


దుస్తులు పంపిణీ చేస్తున్న కోట్ల శ్రీనివాస్

చాదర్‌ఘాట్: కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వ కట్టుబడి ఉందని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెకోలేకర్ లక్ష్మి, వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం మలక్‌పేట్ వ్యవసాయ మార్కెట్‌లోని హమాలీలు, చాట కార్మికులకు దుస్తులు పంపిణీ చేసి మాట్లాడారు. గతంలో ఎన్నడు లేని విధంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన తర్వాత దాదాపు రూ. 10 లక్షలతో దుస్తులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎస్ చిలుక నర్సింహ్మారెడ్డి, పీసీసీ మాజీ కార్యదర్శి చెకోలేకార్ శ్రీనివాస్, డైరెక్టర్లు మస్రత్ సుల్తానా, నెలపాటి రామారావు, అశోక్‌గౌడ్, కృష్ణ, సత్యనారాయణ, హమలి కార్మికులు సంఘం నాయకులు శేఖర్, శివలింగము పాల్గొన్నారు.

శివలింగానికి మహిమలు ఉన్నాయంటూ..

● రూ.2కోట్లకు విక్రయించేందుకు యత్నం
● నలుగురి రిమాండ్



నాగోలు: పురాతన శివలింగానికి మహిమలు ఉన్నాయని, దానిని ప్రతిష్ఠించిన వారికి అదృష్టం వరిస్తుందని దాన్ని రూ. 2 కోట్లుకు విక్రయించడానికి ప్రయత్నిస్తున్న నలుగురిని రిమాండ్‌కు తరలించిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ వివరాల ప్రకారం..నల్గొండ జిల్లా, దామరచర్ల మండలం, కల్లెపల్లికి గ్రామానికి చెందిన ధీరావత్ నరేందర్ గ్రామంలో ఉన్న బంగారు మైసమ్మ దేవాలయంలో పూజారి. రాజేంద్రనగర్ చెందిన మధుబన్ కాలనీ చెందిన మోండిటోక ఇమ్మాన్యుయేల్ అలియాస్ నాని నగరంలో భూగర్భ జల సర్వేయర్. మౌలాలికి చెందిన పబ్బాజో బ్రహ్మచారి వడ్రంగి. నల్గొండ జిల్లా, పెద్దవూర మండలం, తుంగతుర్తికి చెందిన పోలేపల్లి సుధాకర్ ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నలుగురు అప్పుల కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్రమంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఓ అవకాశం కోసం వేచి చూస్తున్నారు. ఈ క్రమంలో నల్గొండ జిల్లా దామరచర్ల మండలం, బోతాలపాలం గ్రామ శివారులోని బైరాంవాని చెరువు గట్టున నందిబోడు వద్ద రాతి విగ్రహం శివలింగం ఉందని తెలుసుకున్నారు. ఇది 13 వ శాతాబ్దనికి చెందినదని చుట్టుపక్కల గ్రామస్తులు ఇప్పటికి భక్తి శ్రద్ధలతో పూజిస్తున్నారు. అక్కడ ఉన్న శివలింగం దొంగిలించడానికి నిర్ణయించుకుని 2023 ఫిబ్రవరిలో శివాలయాన్ని తవ్వి అక్కడ శివలింగం రాత్రి విగ్రహం దొంగలించి బచ్చుపల్లిలోని పాడుబడిన పాత ఇంట్లో దాచిపెట్టారు. ఈ విషయం తెలిసిన బోతాలపాలెం గ్రామస్తులు శివలింగం దొంగతనం గురించి వాడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొన్ని రోజుల తర్వాత ఆ శివలింగంను బ్రహ్మచారికి అప్పగించారు. అప్పటి నుంచి వారు 13వ శతాబ్దానికి చెందినదని, చారిత్రక పురాతన రాతి విగ్రహమైన శివలింగానికి మహిమలు ఉన్నాయని దానిని ప్రతిష్ఠించిన వారికి అదృష్టం తెస్తుందని చెప్పుకుంటూ తిరుగుతూ రూ.2 కోట్లుకు విక్రయించడానికి ప్రయత్నిస్తున్నారు. శుక్రవారం ఎల్‌బీనగర్ మెట్రో ఫ్రీ పార్కింగ్‌లో వద్ద శివలింగాన్ని రూ. 2 కోట్లకు విక్రయించనున్నట్లు తెలుసుకున్న ఎల్‌బీనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నలుగురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీ కనకదుర్గ ఆలయంలో నవరాత్రి పూజల్లో పాల్గొన్న ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు

